విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 27 అక్టోబరు 2024 | 8 పేజీలు

తిరుపతిలోని హొటళ్లకు

మరోసారి బాంబు బెదిరింపు

విశాలాంధ్ర -తిరుపతి : తిరుపతి నగరంలోని రాజ్ పార్క్ హొటల్‌కు శనివారం బాంబు బెదిరింపులు వచ్చాయి.దీంతో హొటల్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు.మరోవైపు గురువారం కూడా తిరుపతిలోని పలు హొటళ్లకు బాంబు బెదిరిం పులు రావడంతో కలకలం రేగింది.తాజాగా లీలామహల్ సమీపంలోని మూడు ప్రైవేటు హొటళ్లు,రామానుజపల్లి కూడలిలోని మరో హొటల్‌కు శనివారం కూడ మెయిల్‌లో బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్త మయ్యారు.

2

అవినీతికి అడ్డా... రేణిగుంట సబ్ రిజిస్ట్రారు కార్యాలయం



- చక్రం తిప్పుతున్న చిరుద్యోగి
- భూముల విలువ, కమీషన్లు ఎంత చెల్లించాలనేది ఆయనే నిర్ణయిస్తాడు
- ఎవరైనా ధిక్కరిస్తే కొర్రీలు వేస్తూ పనులు నిలిపివేస్తాడు
- ఉన్నతాధికారులు సైతం ఈయన మాట వినాల్సిందే

2లో

విద్యా ప్రమాణాల పెంపునకు

సంఘటితంగా కృషిచేద్దాం

- వార్త 8వ పేజీలో

8 **సభ్యత నమోదును విజయవంతం చేద్దాం**

అంతర్గత సీసీ రోడ్లను

నాణ్యతతో పూర్తి చేయండి

పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అప్లోడ్ చేయండి

- జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర -చిత్తూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024-25 సంవత్సరానికి గాను మంజూరు కాబడ్డ 1485 అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం లో భాగంగా వివిధ దశలలో ఉన్న పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా సచివాలయం లోని సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2024- 25 సంవత్సరానికి మంజూరు కాబడ్డ అంతర్గత సీసీ రోడ్స్ అప్రోచ్ రోడ్స్,బీటీ రోడ్స్ ఎంపీ ల్యాండ్స్ కింద మంజూరు కాబడ్డ పనుల పురోగతి పై నియోజకవర్గాల వారీగా సమీక్షించారు.

2

ఓపెన్ హౌస్ నిర్వహణతో ...

విద్యార్థుల్లో సేవాభావం పెరుగుతుంది

పోలీసు ఆయుధాల ప్రదర్శనను ప్రారంభించిన చిత్తూరు ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు

విశాలాంధ్ర- చిత్తూరు: పోలీసు అమర వీరుల వారోత్సవాలలో భాగంగా ప్రతీ ఏటా అమరవీరులైన పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఏ.ఆర్ పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు శనివారం ప్రారంభించారు.జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో జిల్లా పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రదర్శనలో ఉంచారు.ఈ సందర్భంగా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, మీడియాతో మాట్లాడుతూ, పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఈ రోజు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ముఖ్యంగా ప్రజల్లో పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంపొందించడం, పోలీసుల కష్టసాధ్యమైన విధులకు సవరణ పొందేలా చేయడం లక్ష్యంగా నిర్వహించారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలి

ఆరువేల డెబ్బై రెండు కోట్ల విద్యుత్ భారాన్ని రద్దుచేయాలి

: వామపక్ష పార్టీల డిమాండ్

విశాలాంధ్ర - తిరుపతి : పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని నేడు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో లీలా మహల్ పక్కన చేపల మార్కెట్ వద్ద ఉన్నటువంటి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు టి.సుబ్రమణ్యం విశ్వనాథం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత విద్యుత్ ఛార్జీలను ప్రజలపై తీవ్ర బారాలు

2

బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి) డీఎస్పీ వెంకట నారాయణ పర్యవే క్షణలో సిబ్బంది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టారు. ఎక్కడా పేలుడు పదా ర్థాలు లేవని నిర్ధారించుకుని ఊపిరి పీల్చుకున్నారు.కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అవినీతికి అడ్డా...

విశాలాంధ్ర-తిరుపతి : రేణిగుంట సబ్ రిజిస్ట్రారు కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఈ కార్యాలయంలో ఓ చిరుద్యోగి చక్రం తిప్పుతున్నాడు. అక్కడ ఆయన చెప్పిందే శాసనం. ఇక్కడ కీలక అధికారి కూడా చిరుద్యోగి చెప్పినట్లే చేయాలి. లేదంటే తలరాత తారుమారు అవుతుంది. సదరు చిరుద్యోగి ఎలా చక్రం తిప్పుతున్నాడో దీనిని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు. ఇందుకు సంబంధించి వివరాలను పరిశీలిస్తే... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రేణిగుంట చాలా కీలకమైంది. రేణిగుంట మండలం తిరుపతి నగరంలో ఓ భాగంగా మారింది. రేణిగుంట పరిధిలోనే తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. ఈ విమానాశ్రయం పరిసరాల్లో అనేక పరిశ్రమలు ఉన్నాయి. ఇదే మండలంలో ఓ వైద్య కళాశాల కూడా ఉంది. ఇదే కాకుండా ఈ మండల పరిధిలో పలు విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. రేణిగుంటను ఆనుకునే ఆరు వరుసల జాతీయ రహదారి వెళుతోంది. ఈ ప్రాముఖ్యతల నేపథ్యంలో రేణిగుంట మండలంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. భూముల క్రయ, విక్రయాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇదే రేణిగుంట సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో కొందరు ఉద్యోగులకు వరంగా మారింది. ఇక్కడ పనిచేసే ఓ చిరుద్యోగి అన్నీ తానై వ్యవహరిస్తుంటాడు. భూముల విలువ ఎంత వేయాలో... క్రయ, విక్రయదారులు ఎంత కమీషను చెల్లించాలో... డాక్యుమెంటు రైటర్లు ఎలా డాక్యుమెంట్లు రాయాలో అన్నీ ఈయనే శాసిస్తాడు. ఈయన మాట ధిక్కరిస్తే ఈ కార్యాలయంలో ఏ పని జరగదు. ఆయనకు మామూళ్లు సమర్పిస్తే ఏదైనా జరుగుతుంది. ఈ చిరుద్యోగి కారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రైతులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ఏ పని కావాలన్నా... ఈ చిరుద్యోగికి మామూళ్లు సమర్పించాల్సిందే. రియల్ ఎస్టేట్ వ్యాపారులు అయితే ఆయన అడిగినంత కమీషను ఇవ్వాల్సిందే. లేదంటే ఏదో ఒక క్వొరీ పెట్టి... వారి పని కాకుండా చేయడంలో ఈయన దిట్ట. ఈయన చేసేది చిరుద్యోగం అయినా.... కీలక అధికారి పక్కనే కుర్చీలో కూర్చుని అందరినీ శాసిస్తుండటం ఈయన ప్రత్యేకత. ఈయన తీరు చూసి అందరూ ముక్కున వేలేసుకుంటుంటారు. ఏళ్ల తరబడి తిష్ట వేసిన ఈ చిరుద్యోగి కోట్ల రూపాయలకు పడగలెత్తాడు. ఈయన్ను ప్రశ్నించాలంటే అధికారులు కూడా భయపడుతున్నారు. ఇదే అదునుగా ఈ చిరుద్యోగి రేణిగుంట సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని శాసిస్తూ... అవినీతికి అడ్డాగా మార్చేశాడు. ఉన్నతాధికారులైనా స్పందించి రేణిగుంట సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాల్సి ఉంది. ముఖ్యంగా ఇక్కడ చక్రం తిప్పుతున్న చిరుద్యోగిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఉన్నతాధికారులు ఏం చేస్తారో వేచి చూద్దాం.

తక్షణమే ఉపసంహరించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి) మోపుతుందన్నారు.ప్రజానీకానికం పై మూడు నెలలకే రాష్ట్ర ప్రభుత్వం మోత మోగించిందన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబో మంటూ ప్రకటించిన టిడిపి కూటమి ప్రభుత్వం 6072కోట్ల భారాన్ని మోపిందన్నారు. 2022 బి23 సంవత్సరానికి ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్మెంట్ (ఎఫ్‌పిపిసిఎ) వసూళ్లకు ట్రూ అప్ చార్జీలు ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (ఏపీ ఈ ఆర్ సి) అనుమతించింది అన్నారు. ఇప్పటికే అధిక ధరలతో సతమతమవుతున్న సామాన్య ప్రజానీకానికి ఇది పెద్ద పెనుబారం అవుతుందన్నారు. డిస్కంలో 8,114 కోట్లు ప్రతిపాదిస్తే అందులో 2042 కోట్లు తగ్గించి ఉపశమనం కలిగించినట్లు ఏపీఆర్సి పేర్కొనడం గమనార్హం గా ఉందన్నారు. 2022 ఏప్రిల్ లో వినియోగించిన విద్యుత్‌కు ట్రూ ఆప్ చార్జీలను ఈ ఏడాది నవంబరు డిసెంబర్ నెలలో వసూలు చేయబోతున్నారని అన్నారు. 2022 మే నెల ఖర్చును 2025 జనవరి ఫిబ్రవరి నెలలో వసూలు చేస్తారని 2022 జూన్ వినియోగాన్ని 2025 మార్చి ఏప్రిల్ లోను జూలై నెల వినియోగాన్ని 2025 మార్చ్ లో వసూలు చేయబోతున్నారని ఈ విధంగా పథకం ప్రకారం ప్రజల నడ్డి విరిచి ముక్కు పిండి డబ్బులు దండుకునే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఈ విధానం తక్షణమే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు. ఇప్పటికే ధరల పెరుగుదల ఉపాధి సన్నగిల్లి ఆదాయం తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇలా విద్యుత్ భారం మోపడం అమానుషమని తెలిపారు. ఏనాడో వాడిన కరెంటు కు ఏళ్లు గడిచిపోయాక అదనంగా చార్జీలు చెల్లించాలన్న ఎఫ్ పి పి సి ఏ విధానం మోసపూరితమైందని తెలిపారు. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణలోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనదని పేర్కొన్నారు. గతంతో పోల్చుకుంటే ఇది 44% పెరుగుదలని రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు నియంత్రిస్తామని విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలు ఇచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తగ్గించడం సంగతల ఉంచితే ఇప్పుడు అమాంతం 44% పెంచడం దారుణమని తెలిపారు. స్మార్ట్ మీటర్ల కొనుగోళ్ల పేరుతో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని ఈ ప్రభుత్వం కొనసాగించడం దుర్మార్గమని తెలిపారు మాట తప్పి ప్రజలపై వేసిన ట్రూ ఆప్ చార్జిల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని లేని పక్షంలో 2000 సంవత్సరంలో బషీర్బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటం స్ఫూర్తితో రాష్ట్రంలోని వామపక్ష పార్టీలన్నీ అదే తరహాలో పోరాడి విద్యుత్ వారానికి వ్యతిరేకంగా చలో విజయవాడ ముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సభ్యులుచిన్నం పెంచలయ్య సిపిఎం జిల్లా నాయకులు జయచంద్ర సాయి లక్ష్మి బాలసుబ్రమణ్యం ఆర్ లక్ష్మి కె వేణుగోపాల్ పి. బుజ్జి ఎం.నరేంద్ర చిన్న బాబు హేమలత రాధాకృష్ణ,మునిరాజా, కె.ఆర్.సుబ్రహ్మణ్యం, రవి, మోహన్ నాయుడు, ప్రసన్న, సిపిఐ నాయకులు పద్మనాభరెడ్డి, విజయ, జనార్ధన్, ఉదయ్, కేవైరాజా తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పూర్తి చేయండి

(మొదటి పేజీ తరువాయి) ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్గత సిసి రోడ్ల కు సంబంధించి 1485 మంజూరు కాగా 413 పనులు గ్రౌండింగ్ కాబడ్డాయని, ఇందులో 239 పనులు పూర్తి కాగా 174 పనులు పురోగతి లో కలవని తెలిపారు. ప్రధానంగా గ్రామీణ రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యత ఇస్తూ సిసి రోడ్లను ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని,ప్రజాధనం ఎక్కడ వృధా కాకుండా సకాలంలో పనులనుపూర్తిచేయాలన్నారు. ఈ విషయం లో సంబంధిత ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని పనులను నాణ్యతతో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. 1279 పనులకు గుత్తేదారుల ను గుర్తించడం జరిగిందని, వాటి పనులు కూడా ప్రారంభించేలా డిఇ లు, ఏ ఈ లు శ్రద్ధ పెట్టాలన్నారు. ఎస్టిమేషన్ కాస్ట్,బిల్స్ అప్లోడింగ్, పనుల పురోగతిపై డ్వామా పిడి,ఎస్ ఈ పిఆర్ లుసమన్వయంతోపర్యవేక్షించాలన్నారు. వర్క్ ఐడి క్రియేట్ చేసి జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించారు.పి ఆర్ యాప్ నందు పనుల పురోగతి ని సంబంధించిన వివరాలు అప్లోడ్ చేయాలని సూచించారు. సీసీ రోడ్ల మంజూరు లో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ కాలనీలలో, హౌసింగ్ లేఔట్లలో ప్రాధాన్యత ను ఇచ్చి పనులను మంజూరు చేయడంజరిగిందని వీటిని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావడం ద్వారా ప్రజలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని ఈ దిశగా అధికారులు పని చేయాలన్నారు.ఈ సందర్భంగా నియోజక వర్గాల వారీగా పనుల పురోగతి,పనులు ప్రారంభించక పోవడానికి గల కారణాలను సమీక్షిస్తూ ప్రజాప్రతినిధులతో చర్చించి త్వరితగతిని ప్రారంభించేలా, పనులు జరుగుతున్న చోట పనులను త్వరగా పూర్తిచేసేలాచర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్ఈ పి ఆర్ శంకరనారాయణ, ఈఈ చంద్రశేఖర్ రెడ్డి,డ్వామాపీడీరవికుమార్,సంబంధితడిఈలు,ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సేవాభావం పెరుగుతుంది

(మొదటి పేజీ తరువాయి) విద్యార్థులకు ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు తమ నిత్య జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను వారు ఉపయోగించే ఆయుధాలను నేరుగా చూడగలిగే అవకాశమన్నారు. పోలీసు విభాగం లోని తీరుపై అవగాహన కలిగించడం ద్వారా విద్యార్థుల్లో సమాజ సేవ పట్ల ఆసక్తి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విభిన్న విభాగాలను పరిశీలించే అవకాశం కలిగిన విద్యార్థులకు ఎఆర్ సిబ్బంది ఆయుధాల వివరణ అందించారు. ఆయుధాల వినియోగ విధానాలు, ఎలాంటి సందర్భంలో ఎలాంటి ఆయుధం వాడవలసి ఉంటుందో, ఆ ఆయుధం ఎలా పనిచేస్తుందో సిబ్బంది తెలిపారని ఎస్పీ పేర్కొన్నారు.ప్రదర్శనలో ఉంచిన విభాగాలు.ప్రదర్శనలో వివిధ విభాగాలను ఆకర్షణీయంగా అందుబాటులో ఉంచారు. ముఖ్యంగా డాగ్ స్క్వాడ్ ద్వారా పోలీసు దర్యాప్తుల్లో డాగ్ స్క్వాడ్ పాత్రను ప్రదర్శించారు. ఆయుధాల ప్రదర్శన లో పోలీస్ బలగాలు వినియోగించే ఆయుధాలు, వాటి వినియోగ పద్ధతుల గురించి వివరించారు. బాంబు డిటెక్షన్ స్క్వాడ్ విభాగంలో అత్యవసర పరిస్థితుల్లో బాంబులను గుర్తించే విధానాలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. కమ్యూనికేషన్ విభాగం లో పోలీసుల మధ్య సమాచార మార్పిడి విధానాలు, ఆధునిక రేడియో పరికరాల ప్రదర్శన చేసారు. ఫింగర్ ప్రింట్స్ క్లూస్ టీం విభాగం ద్వారా నేరాల విచారణలో ఆధారాలను సేకరించే తీరును వివరించారు. ట్రాఫిక్ విభాగం లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో ఉపయోగించే పరికరాలు ప్రదర్శించారు. సైబర్ క్రైమ్ స్టాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, సైబర్ నేరాలపై యువతలో అవగాహన పెంచడానికి సైబర్ భద్రతా చిట్కాలు అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ వాహనాల ప్రదర్శన కూడా ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది, ఇందులో ఫాల్కన్ వాహనం సహా ఇతర పోలీసు వాహనాలు ప్రదర్శనలో ఉంచారు.ఈ కార్యక్రమానికి ఆర్.ఐ లు భాస్కర్, సుధాకర్, ఎస్సైలు, ఆర్.ఎస్సైలు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, ఎఆర్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర -తిరుపతి: కర్ణాటకలోని కిట్టూర్ రాణి చెన్నమ్మ రెసిడెన్షియల్ సైనిక్ స్కూల్ ఫర్ గర్ల్స్ లో ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసిందని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరమునకు జాతీయ స్థాయిలో 02 ఫిబ్రవరి 2025న ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు, ఈ పరీక్షకు 2013 జూన్ 1 నుంచి 2015 మే 31 మధ్య జన్మించిన విద్యార్థినులు అర్హులు అని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష 300 మార్కులకు ఉంటుంది అని ఇందులో మేథమెటిక్స్,ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్,జనరల్ నాలెడ్జ్ మరియు మెంటల్ ఎబిలిటీ సబ్జెక్ట్‌లపై నుంచి ప్రశ్నలు ఇస్తారు. మరిన్ని వివరాలకు మరియు దరఖాస్తుల కొరకు తిరుపతి విశ్వం ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం ద్వారా 86888 88802 / 93999 76999 ఫోన్ నంబర్లను సంప్రదించగలరు.

చదువుతో పాటు కళలకు ప్రాధాన్యం

- ఎంజీఎం డైరెక్టరు గుడ్లూరు మయూర్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఎంజీఎం విద్యా సంస్థల్లో చదువుతో పాటు కళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆ సంస్థల డైరెక్టరు గుడ్లూరు మయూర్ చెప్పారు. ఎంజీఎం పాఠశాలలో శనివారం విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ... ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ డే సందర్భంగా 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించామన్నారు. ఇందులో 60మంది విద్యార్థులు పాల్గొన్నార న్నారు. ఈ పోటీలను మూడు భాగాలుగా విభజించామని... మొదటి డివిజన్లో ఒకటి, రెండు, మూడవ తరగతుల విద్యార్థులు పోటీ పడ్డారన్నారు. ఇందులో వి.ధరణి కార్తీక, జి.చారిక, మనస్విని వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారన్నారు. వీరికి రూ.2వేలు, రూ.1,000, రూ.500 వంతున నగదు బహుమతి ఇచ్చినట్లు ఆయన చెప్పారు. ఇక రెండవ డివిజన్లో పి.పోషిత, కే.జస్మిత, వి.యాషిక వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారన్నారు. వీరికి కూడా రూ.2వేలు, రూ.1,000, రూ.500వంతున నగదు బహుమతి ఇచ్చామన్నారు. ఇక మూడవ డివిజనులో 7,8,9,10వ తరగతులకు సంబందించి... టి.హర్షవర్ధన్, జి.జీవన, డి.భానుప్రియ మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. వీరికి కూడా మొదటి, రెండవ డివిజన్ల వారికి ఇచ్చినట్లే నగదు బహుమతి ఇచ్చామన్నారు. ఈ పోటీల్లో అన్ని విభాగాలకు మొదటి స్థానంలో నిలిచిన ఎస్ కే మహమ్మద్ ఇర్ఫాన్ కు రూ.5వేలు నగదు బహుమతి అందచేసినట్లు గుడ్లూరు మయూర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం కాలేజ్ ప్రిన్సిపల్ సుబ్బరత్నం, ఎం.ముని పరుశురాం, సిబ్బంది పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి...

ఆలయాలకు విరాళాలు అందజేత

విశాలాంధ్ర - పలమనేరు: ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పలు ఆలయాల అభివృద్ధికి అమరన్న యువసేన నాయకులు విరాళాలను చెక్కుల రూపంలో అందజేశారు. పెద్దపంజాణి మండలం అమరన్న యువసేన నాయకులు సునీల్ రెడ్డి ఎన్నికలకు మునుపు అమరనాథ రెడ్డిని ఆదరించి గెలిపిస్తే గ్రామాలలో సమస్యల అభివృద్ధి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఇచ్చిన మాటకు కట్టుబడి పెద్దపంజాణి మండలంలోని వీరపల్లి సుబ్రహ్మణ్య స్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష , మారపల్లి గంగమ్మ ఆలయానికి రూ. 20 వేలు, బొమ్మలకుంట గంగమ్మ గుడికి రూ. 30 వేలు, మద్దలకుంట వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ. 50 వేలు మొత్తం రూ. 2 లక్షలను విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కులను పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి చేతుల మీదుగా గ్రామస్తులకు పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డిని శాసనసభ్యులు అమరనాథ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు నవీన్‌తో పాటు గ్రామస్తులు తెలుగుదేశం పార్టీ నేతలు ఉన్నారు.

కంచి రాజేంద్ర కుటుంబాన్ని ఆదుకోండి

- కలవగుంట భరత్ రెడ్డి

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి మండలం దొమ్మరపాళెం వద్ద ఇసుక ట్రాక్టరు ప్రమాదంలో దుర్మరణం చెందిన కంచి రాజేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రముఖ సంఘ సేవకులు, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలవగుంట భరత్‌రెడ్డి డిమాండు చేశారు. తొట్టంబేడు మండలం చియ్యవరంలో గల రాజేంద్ర భార్య గురవమ్మను శనివారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ప్రమాదంలో మృతి చెందిన రాజేంద్ర, చైతన్య ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన కోరుకున్నారు. తొట్టం బేడు తహసీల్దారుతో ఫోన్ లో మాట్లాడి... గురవమ్మకు ప్రభుత్వం నుంచి త్వరగా పరిహా రం అందేలా చర్యలు తీసుకోవాలని కలవగుంట భరత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురవమ్మ పిల్లల చదువుకు తనవంతు సహకారం అందిస్తానని భరత్ రెడ్డి హామీ ఇచ్చారు. స్వర్ణముఖి నది నుంచి ఇసుక అక్రమంగా తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారు లకు విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఇసుక తరలించడానికి అనుమతి ఉంటే పగటి వేళ మాత్రమే తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రివేళలో ఇసుక తరలింపుపై నిషేధం విధించాలన్నారు. లైసెన్సు లేకుండా ట్రాక్టర్లు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవా లన్నారు. అక్రమంగా ఇసుక తరలించే వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకో వాలని ఆయన డిమాండు చేశారు. కాసరం రహదారి అధ్వానంగా తయారు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కలవగుంట భరత్ రెడ్డి కోరుకున్నారు.

పోలీస్ బందోబస్తు నడుమ మండల సమావేశం

విశాలాంధ్ర - పుంగనూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం రోజున మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో లీలా మాధురి ఏర్పాటు చేయడం జరిగింది మండలం ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీలు సర్పంచులు అందరూ వైసిపి వారే కావడంతో వారిని సమావేశానికి రానివ్వకుండా టిడిపి శ్రేణులు అడ్డుకుంటారనే ఉద్దేశంతో అర్బన్ సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది పోలీసుల వలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు ఎంపీడీవో లీల మాధురి మాట్లాడుతూ సమావేశంలో శాఖల వారి ప్రోగ్రెస్ లో ఉన్న అంశాలను సమావేశం దృష్టికి తేవాలని అధికారులును కోరడం జరిగింది అధికారులు వారి వారి శాఖలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను సమావేశంలో పేర్కొనడం జరిగింది ముఖ్యంగా వ్యవసాయ శాఖ అధికారి జ్యోతి మాట్లాడగా ఎంపీపీ భాస్కర్ రెడ్డి కలుగజే సుకుని మీ శాఖలో జరుగుతున్న అంశాలను ఎంపీపీ జడ్పిటిసి స్థానిక ప్రజాప్రతినిధులుకు తెలియకుండానే నిర్వహిస్తున్నారు అన్నారు మొన్నటికి మొన్న మాకు తెలియకుండానే ఉలవలు పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని హెచ్చరించడం జరిగింది ఇలా జరగకుండా అధికారులు జాగ్రత్త పాటించాలని తెలియజేశారు అలాగే పంచాయతీరాజ్ శాఖ ఏ ఈ చందన మాట్లాడుతుండగా మండలంలోని గ్రామాల్లో నీళ్లు సమస్యలు ఉన్నా యని వాటి పరిష్కారం కోసం కొత్త బోర్లు ఏర్పాటు చేయాలని ఎంపీపీ భాస్కర్ రెడ్డి సూచిం చడం జరిగింది. అదేవిధంగా విద్యాశాఖలో కాళీ ఉన్న 33 టీచర్ల పోస్టులను భర్తీ చేయాల న్నారు. లేని కారణంగా విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల వైపు చూస్తున్నారని ఎంఈఓ కు సూచించడం జరిగింది. ఎంఈఓ దీనిపై దృష్టి సాధించి జిల్లా అధికారులతో మాట్లాడటం జరుగుతుందని తెలియజేశారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల్లో జరిగే అన్ని అభివృద్ధి కార్యక్రమాలను మండల ఎంపీపీ జడ్పిటిసి సర్పంచులు ఎంపీటీసీలకు తెలియజేయవలసిన అవసరం ఉందని తద్వారా మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుందామని అధికా రులకు ఎంపీపీ సూచించడం జరిగింది. ప్రశాంతంగా సమావేశం ముగియడంతో పోలీ సులు ఊపిరి పీల్చుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సరోజమ్మ ఈశ్వ రమ్మ మండల్ కోఆప్షన్ సభ్యులు బావజాన్ మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు న్యాయం చేస్తాం

-సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి



విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జైలు శిక్ష అనుభవిస్తూ సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు న్యాయం చేస్తా మని శ్రీకాళహస్తి న్యాయ స్థానం సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి చెప్పారు. శ్రీకాళహస్తి సబ్ జైలును శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భం గా సబ్ జైలులో పరివర్తన చెందుతున్నవ్యక్తులు...వారి కేసుల వివరాలను అడిగి తెలు సుకున్నారు.ఈ సందర్భంగా న్యాయమూర్తి బేబీరాణి మాట్లాడుతూ...హైకోర్టు ఆదేశాల మేరకు తాను శ్రీకాళహస్తిలోని సబ్ జైలును పరిశీలిస్తున్నట్లు చెప్పారు. జైలులో పరివర్తన చెందిన ఖైదీలకు న్యాయంచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఖైదీ మంచి ప్రవర్తన అలవరచుకోవాలనిఆమెకోరుకున్నారు.ఈమె వెంట పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుతో బహుళ ప్రయోజనాలు

- ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి చెప్పారు. శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరు, అక్కుర్తితో పాటు రేణిగుంటలో శనివారం ఆయన టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఎంతో దూర దృష్టితో... ప్రతి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నారన్నారు. సభ్యత్వ నమోదు రుసుము రూ.100 చెల్లిస్తే... సభ్యత్వం తీసుకున్న వారి ఇంటిలో ఎవరైనా చనిపోతే వెంటనే దహనక్రియలకు రూ.10వేలు ఇస్తారన్నారు. ప్రమావశాత్తు చనిపోతే రూ.5లక్షలు ఇస్తారని ఆయన తెలిపారు. తద్వారా ఆ కుటుంబం ఆర్థికంగా నిలబడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ గల పార్టీ అన్నారు. ఈ పార్టీతోనే ఏపీ అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఆయన చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ టీడీపీలో భాగస్వామ్యం కావాలనిఆయనకోరుకున్నారు. సభ్యత్వ నమోదులో శ్రీకాళహస్తిని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపా లని ఆయన చెప్పారు. ఇందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి పట్టణ టీడీపీ అధ్యక్షులు జి విజయ్ కుమార్, రంగినేని చెంచయ్య నాయుడు, కంతా రమేష్, ప్రతాపరెడ్డి, జయచంద్ర నాయుడు, గుత్తా విజయకు మార్, సుజిత్, పవన్, ప్రవీణ్, పీఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుండా వాహనాలు తిప్పితే జరిమానా

- ఎంవీఐ దామోదరనాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పన్నులు చెల్లించకుండా వాహనాలు తిప్పితే జరిమానా విధిస్తామని శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదరనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం శ్రీకాళహస్తి ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, పన్ను చెల్లించకుండా తిప్పుతున్న రెండు ట్రాక్టర్లకు రూ.65వేల వంతున జరిమానా విధించారు. ఈ సందర్భంగా దామోదరనాయుడు మాట్లాడుతూ... శ్రీకాళహస్తి రవాణాశాఖ కార్యాలయ పరిధిలో చాలా వాహనాలు పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఇందులో ముఖ్యంగా వాణిజ్య అవసరాలకు వాడే ట్రాక్టర్ ట్రైలర్స్ సుమారుగా 600 వాహనాలు పన్నులుచెల్లించకుండా తిరుగుతున్నాయన్నారు. వీటి మీద తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. తనిఖీలలో పట్టుబడిన వాహనాన్ని నిర్బంధించడం జరుగుతుందన్నారు. శ్రీకాళహస్తిలో చాలా మంది ట్రాక్టర్ల డ్రైవర్లు సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్నారన్నారు. అలా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని వివరాలు ఇప్పుడు అనే సాఫ్ట్వేర్ నకు మార్చబడిందన్నారు. పన్నులు చెల్లించే వారు ఈ వెబ్సైట్ లో చెల్లించాలని ఆయన కోరారు. వాహనాలకు సంబంధించిన ఇతర పనులు కూడా ఈ వెబ్సైట్ లో చేసుకోవచ్చన్నారు. పన్ను చెల్లించకుండా వాహనాలు రోడ్డు మీద తనిఖీలలో పట్టుబడితే 200 శాతం జరిమానా విధిస్తామన్నారు. ఇది గమనించి వాహనదారులందరూ సకాలంలో పన్నులు చెల్లించాలని దామోదరనాయుడు కోరుకున్నారు.

సంఘమిత్ర ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-తొట్టంబేడు: అధికార పార్టీ నేతల వేధింపులు తాళలేక తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ సంఘమిత్రగా పనిచేస్తున్న రేవతి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు గుర్తించి ఆమెను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె ఆత్మహత్యాయత్నం చేయబోయే మునుపు విడుదల చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. బాధితురాలి కథనం మేరకు...తాటిపర్తి పంచాయతీ సంఘమిత్రగా రేవతి 16 ఏళ్లుగా సేవలందిస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక టీడీపీ నేతలు రేవతిని తొలగించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. ఆమెకు వ్యతిరేకంగా గ్రామస్తుల వద్ద అబద్ధపు సంతకాలు చేయించారు. రేవతి ఉండగానే మరొకరిని సంఘమిత్రగా పెట్టి పనులు చేయించారు. ఇదంతా తెలుసుకున్న రేవతి తనకు న్యాయం చేయాలని... తొలగించకుండా చూడాలని పలుమార్లు స్థానిక అధికార నేతలు మొదలుకుని మండల నేతలు చుట్టూ తిరిగింది. అధికారులను వేడుకుంది. ఎమ్మెల్యే గడప తొక్కింది. అయినా ఆమెకు న్యాయం జరగలేదు. కొత్తగా వచ్చిన మహిళా ఏపీఎంకు తన సమస్యను విన్నవించినా ఆమె కూటమి నేతల మాటకే కొమ్ముకాయడంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది.

ప్రభుత్వాలే వేరు... మాఫియా ఒక్కటే

- కార్మిక సంఘాల నేతల ఆరోపణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రభుత్వాలు వేరైనా..ఇసుక, మట్టి మాఫియా ఒకటేనని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. వారంతా సిండికేట్లు కావడంతోనే ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా 'మూడు పువ్వులు.. ఆరు కాయలు'గా తమ మాఫియా సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నట్లు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షులు వైఎస్ మణి సంయుక్తంగా మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలో ఇసుక, మట్టి మాఫియా పెట్రేగిపోతోందన్నారు. కొందరు నాయకులు పార్టీలతో సంబంధం లేకుండా సిండికేట్ గా ఏర్పడి తెల్ల బంగారాన్ని దోచేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక మాఫియా దాహానికి తొట్టంబేడు మండలంలోనే ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో ఓ తండ్రీ, కొడుకు ఉండడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ వ్యాపారం జరిగిందని ఆరోపించిన కూటమి నేతలు అధికారంలోకొచ్చి నాలుగు నెలలు గడిచిపోతున్నా... ఎందుకు అప్పటి మాఫియా నేతలపై పీడీయాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి ఇసుక, మట్టి మాఫియాపై ఉక్కు పాదం మోపాలని కోరారు. ఇసుక ట్రాక్టర్ ఢీ కొట్టి ప్రాణాలు కోల్పోయిన కంచి రాజేంద్ర, చైతన్య కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా, రెండెకరాల సాగుభూమినివ్వాలని డిమాండు చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న ఇసుక, మట్టి మాఫియాకు వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, కుమార్ వెంకటేష్, అన్వర్ బాషా, వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు జనమాల గురవయ్య, పీడీఎస్ యూ నాయకులు జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

సగుటూరులో చోరీ

విశాలాంధ్ర-ఓజిలి: మండలంలోని సగుటూరు గ్రామంలో శుక్రవారం ఒక ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోనికి వచ్చింది. గ్రామంలో స్వీకరించిన వివరాల ప్రకారం సగుటూరు గ్రామానికి చెందిన నాగమణి ఇంట్లో ఎవరూ లేనిది చూసి శుక్రవారం ఇంటి తాళం పగలగొట్టి సుమారు 22 సవర్లు బంగారు, నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని పోయారని స్థానికులు తెలియజేస్తున్నారు. అయితే ఈ చోరీలు ఓజిలి పోలీసులకు పట్టుకోండి చూద్దాం మని దొంగలు మళ్లీ సవాల్ విసురుతున్నారని ప్రజలలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మండల సర్వ సభ్య సమావేశం

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గురవయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు. పలు సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఇంద్రాణి, ఎంపీడీవో మధుసూధన్ రావు, ఎం.ఆర్.వో చంద్ర శేఖర్, పిఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

విశాలాంధ్ర-పాకాల: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం పాకాల మండలంలోని పదిపట్ల బయలు గ్రామపంచాయతీలో చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె లక్ష రూపాయల కట్టి శాశ్వత సభ్యత్వం నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో టిడిపి సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో చేపట్టేలా తెలుగుదేశం పార్టీ శ్రేణులు, శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పేర్కొన్నారు. జడ్పిటిసి పద్మజా రెడ్డి మండల టిడిపి కన్వీనర్ నాగరాజు నాయుడు నాయకులు ఫల్గున కుమార్, మదనమోహన్, చలపతి, కుమారస్వామి నాయుడు, కోటేశ్వర్ నాయుడు, ఈశ్వర్ చౌదరి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కీళపూడిలో టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-పిచ్చాటూరు: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు 2024-26 కార్యక్రమం శనివారం పిచ్చాటూరు మండలం కీళపూడి గ్రామంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమం తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు కే.సతీష్ నాయుడు, పిచ్చాటూరు మండల టీడీపీ అధ్యక్షులు ఎమ్.తిరుమలై రెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు డి.పద్మనాభ రాజు అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా, కార్యకర్తల కుటుంబాలలోని విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం మరియు ఉపాధిని అందించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మధుబాల పద్మనాభ రాజు, సీనియర్ నాయకులు కృష్ణం రాజు, సురేష్ బాబు నాయుడు, గ్రామ టీడీపీ అధ్యక్షులు లక్ష్మణ రాజు, నెహ్రూ రెడ్డి, చంద్ర రెడ్డి, రాజేంద్ర రెడ్డి, సురేష్ నాయుడు, కీళపూడి రఘు నాయుడు, మునిసేకర్, మునస్వామి, వేలూరు నీలకంఠం నాయుడు, నీరువాయి నందగోపాల్, ఏకాంబరం, కారూరు బాలన్ రెడ్డి, గజేంద్ర రెడ్డి, విజయన్, ఏలుమలై, చెంచురాజుల కండ్రిగ సుబ్రమణ్యం రాజు, కృష్ణం రాజు, మునిరాజ్, ఎస్.ఎస్.బి.పేట ప్రకాష్, నేషన్, బాక్మీయరాజ్ పిచ్చాటూరు రవి రెడ్డి,పురుషోత్తం రెడ్డి,జయచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం

గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

విశాలాంధ్ర-గూడూరు: కార్యకర్తల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నరాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ అని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సునీల్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలం కార్యకర్తలే అని పేర్కొన్నారు. పార్టీ కష్ట కాలంలో కూడా కార్యకర్తలు పార్టీ వెన్నంటే నిలిచారని పేర్కొన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సొంతం అని అన్నారు. పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయలు యాక్సిడెంట్ భీమ కల్పించడంతోపాటు మరణించిన కార్యకర్తల దహన సంస్కారాలకు పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తుందని అదేవిధంగా ఆసుపత్రులలో చికిత్స పొందే కార్యకర్తలకు ఆర్థిక సాయం అందజేస్తుందని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పర్యవేక్షించేందుకు 15 మందిని నియమించడం జరిగిందని తెలిపారు. నియోజవర్గ పరిధిలో ఉన్న ఓటర్లలో ప్రతి నలుగురిలో ఒకరిని తప్పనిసరిగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వం అదేవిధంగా కృషి చేయాలని క్లస్టర్ ఇన్చార్జిలకు సూచించారు. నియోజకవర్గ పరిధిలో అత్యధిక సభ్యత్వ నమోదు జరిగే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. పార్టీ సభ్యత్వం కలిగిన వారికి ఏదైనా ఆపద కలిగితే ఆదుకునేందుకు వీలు ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకొని నాయకులు సభ్యత్వ నమోదుపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వం తీసుకోండి-బీమా పొందండి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం చేసుకోండి పార్టీ అందించే భీమ సౌకర్యంతో లబ్ది పొందండి అంటూ మండల పార్టీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి సుధాకర్ నాయుడు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్యక్రమంలో పేర్కొన్నారు. మండలంలో శనివారం కాటూరు పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఎం సుధాకర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు సభ్యత్వ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య నాయుడు, మధు నాయుడు, చెంచు రామానాయుడు, ఎస్ సుధాకర్ నాయుడు, ఎస్ రవి నాయుడు,రాష్ట్ర కమిటీ నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు మహిళా నాయకులు గ్రామ కమిటీ యువత ఇతర పార్టీ అనుబంధ కమిటీ నాయకులు సభ్యులు నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి సజీవ దహనం

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలంలోని టెంకాయ తోపు గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుపతి నుండి నాయుడుపేట వైపు వెళుతున్న మైసూర్ నుండి కలకత్తా కు వెళ్ళవలసిన కంటైనర్ లారీ ఓవర్ ట్రాక్ చేస్తున్న క్రమంలో ముందు కాకినాడకు వెళుతున్న జ్యూస్ లారీని వెనుక వైపు నుండి ఢీకొనుట జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటైనర్ క్యాబిన్ లో మంటలు చెలరేగి డ్రైవర్ సర్ఫ్ రాజ్ (18) అక్కడకక్కడే సజీవ దహనం అయినాడు. మరణించిన వ్యక్తి కి తల్లి తారా బేగం ఆమెకు ముగ్గురు కుమార్తెలు. ముగ్గురు కుమార్తెల్లో ఒకరికి సొంత లారీ ఉండడంతో ఇతనే డ్రైవరుగా ఉంటున్నాడు, కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి రాకపోవడంతో పూర్తి సమాచారం రాలేదు.

నవీన్ దంపతులచే క్రీడా దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-చౌడేపల్లి: ప్రముఖ పారిశ్రామికవేత్త కేసి నవీన్ బాబు ఆయన సతీమణి మోనికలు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు స్థానిక ఉన్నత పాఠశాలనందు చిత్తూరు జిల్లా స్థాయిలో అండర్ 17 బాల బాలికల కబడ్డీ క్యాంప్ నిర్వహిస్తున్నారు ఈ క్రీడాకారులు శనివారం క్యాంపు ముగించుకుని రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు సన్నద్ధం అవుతున్నారు ఈ క్రమంలో క్రీడా ప్రోత్సాహక దాత కేసీ నవీన్ బాబు ఆయన సతీమణి మోనికలు 40మంది బాల బాలికలకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు గతంలోనూ ఆయన చిత్తూరు జిల్లా జట్టుకు దాతగా వ్యవహరించారు దీంతో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు రెడ్డి దంపతులను సత్కరించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్ రాజేంద్ర మురళి ఈశ్వర్ సుధాకర్ పరిమళ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వై.జె.పి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: లైన్స్ క్లబ్ గూడూరు వైజెపి సేవా కార్యక్రమాల్లో భాగంగా గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు డెలివరీ వార్డ్‌లో పురిటి పిల్లలకు కిట్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి దాతగా వైజెపి క్లబ్ ప్రెసిడెంట్ పివి మనోజ్ కుమార్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా గవర్నమెంట్ హాస్పిటల్ నందు జన్మించిన పిల్లలకు సుమారుగా వెయ్యి రూపాయలు విలువ గల సామాగ్రి అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఫాస్ట్ రీజన్ చైర్మన్ ఆర్.వి.రావు మాట్లాడుతూ క్లబ్ అధ్యక్షుడు వరుసగా రెండు నెలలు ఈ కార్యక్రమం చేస్తున్నందుకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎస్ఎల్ఎన్ స్వామి రవీంద్ర రెడ్డి ట్రెజరర్ గోపీనాథ్ రెడ్డి, టౌన్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం యాదవ్, సెక్రెటరీ శీను యాదవ్ ట్రెజరర్ పసుపులేటి ప్రసాద్, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యర్రంరెడ్డిపల్లెలో బాల్య వివాహం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లి సమీపంలోని యర్రంరెడ్డిపల్లెకు చెందిన 14 ఏళ్ల బాలికకు గురువారం రాత్రి బాల్య వివాహం జరిగింది. ఈ బాలిక ఓబులాయపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతూ ఉండేది. వీరిది చాలా పేద కుటుంబం. ఈ బాలిక తండ్రి ప్రత్యేక ప్రతిభావంతుడు. తల్లి కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ ఉంది. పేదరికం కారణంతో ఈ బాలికను అదే గ్రామానికి చెదిన తన సమీప బంధువు (29)కు ఇచ్చి వెంకటగిరిలో వివాహం చేశారు. వాస్తవానికి వీరి వివాహం వచ్చే నెల 3వ తేదీన జరపాలని పెద్దలు నిశ్చయించారు. అయితే స్థానికంగా ఉన్న సచివాలయ ఉద్యోగులకు తెలియడంతో వారు వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఉన్నతాధికారులకు తెలిస్తే పెళ్లి అడ్డుకుంటారనే ఉద్దేశ్యంతో ముహూర్తం కంటే ముందుగానే చేసేశారు. బాల్య వివాహం జరిగిన విషయం శ్రీకాళహస్తి సీడీపీవో శాంతిదుర్గకు తెలియడంతో ఆమె తన సిబ్బందిని యర్రంరెడ్డిపల్లెకు పంపారు. అంగన్ వాడీ, సచివాలయ మహిళా పోలీసులు కలసి బాలిక, పెళ్లి కుమారునితో పాటు వారి తల్లిదండ్రులను శ్రీకాళహస్తి గ్రామీణ పోలీసు స్టేషన్ కు తీసుకువచ్చారు. అక్కడ వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. కాగా బాలికను బాలసదన్ లో ఉంచుతామని సీడీపీవో శాంతిదుర్గ తెలిపారు. అదేవిధంగా బాలిక చదువు కొనసాగించడానికి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: సమాచార హక్కు చట్టం (2005) పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని రామచంద్రాపురం మండల వ్యవసాయ అధికారిణి స్రవంతి అన్నారు. శనివారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామ రైతు సేవా కేంద్రం నందు సమాచార హక్కు చట్టం-2005 పై రైతులకు, మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై పూర్తిగా అవగాహన కల్పించి, సెక్షన్ 4(1)(బి) ప్రకారం కార్యాలయం ఆవరణలో సమాచార హక్కు బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. సమాచార బోర్డులో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార పేర్లు, హోదా, మొబైల్ నెంబర్లు స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలియజేసారు. సమాచారం తెలుసుకోవడం ప్రజల హక్కు సమాచార హక్కు చట్టం ప్రకారం కోరిన సమాచారం అందుబాటులో లేకుంటే సంబంధిత శాఖల అధికారులకు సదరు దరఖాస్తు బదలాయించవచ్చు అన్నారు. రిజెక్ట్ చేసిన సందర్భాలలో దరఖాస్తుదారునికి లిఖితపూర్వకంగా కారణాలు తెలియజేయాలని, కావున కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత సంబంధించిన సమాచారి అధికారిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: నగిరి నియోజకవర్గం ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల నాయకుల సమావేశం ఎస్ షబ్బీర్ భాష అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ చిత్తూరు జిల్లా గౌరవ అధ్యక్షులు యస్. నాగరాజు మాట్లాడుతూ భారతదేశంలోని మొట్ట మొదటిగా 1920 అక్టోబర్ 31న తేదీన ఏఐటియుసి సంఘం ఏర్పడి నాటి నుడి నేటి వరకు కార్మికుల సమస్యల పైన నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం అన్నారు. ఆనాడు కార్మికులు 16 గంటలు 20 గంటలు పని చేస్తున్న రోజుల్లో ఏఐటియుసి కార్మికుల పక్షాన ఉంటూ సమస్యల పరిష్కారం కోసం బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి న ఏకైక యూనియన్ ఏఐటీయూసీ పని గంటల కోసం ,వారి హక్కుల కోసం కార్మికుల చట్టాల కోసం భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన ఘనత ఏఐటియుసి కార్మిక సంఘానికి ఉందన్నారు ఇలాంటి త్యాగాలు చేసి కార్మికుల పక్షాన ఉంటున్న ఏఐటిసి ఏఐటియుసి 14వ వ్యవస్థాపక దినోత్సవాన్ని దీపావళి పండుగ పోలే ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు ఈ సమావేశం లో నగిరి పట్టణ సిపిఐ కార్యదర్శి వి.వేలన్, కార్యవర్గ సభ్యులు, యస్ షబ్బీర్ భాష,ఎన్.విజయ కుమార్, ఏఐటియుసి నగిరి అనుబంధ సంఘాల పట్టణ నాయకులు మురళి, హంస, నగోమి, శేఖర్, రాజేంద్ర, సతీష్ విమల, నాగరాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ షెడ్యూల్ కులాల సంక్షేమ మండలి సభ్యుడిగా మించల ప్రదీప్ నియామకం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్: జాతీయ షెడ్యూల్ కులాల సంక్షేమ పథకాల అమలు మండలి సభ్యుడిగా తిరుపతికి చెందిన మించల ప్రదీప్ ను నియమిస్తూ ఆ సంస్థ సంయుక్త కార్యదర్శి వి ప్రసాద్ ఉత్తర్వుల ద్వారా తెలియజేశారు, గతంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏపీ సభ్యుడిగా రెండు పర్యాయాలు,ఆహార భద్రత, తనిఖీ, నాణ్యత పంపిణీ, మంత్రిత్వ శాఖలో మించల ప్రదీప్ పని చేశారు. జాతీయ స్థాయిలో పనిచేసే ఈ కమిటీకి రెండేళ్లు పాటు కొనసాగుతారని తెలిపారు. బహుజనులు అనాదిగా అధికారానికి దూరమై,విద్యా, వైద్య క్రీడా ప్రైవేట్,వ్యాపారం వెనుకబడి ఇప్పటికి పేద బతుకులు బతుకుతున్నారని అలాంటివారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అందించే సంక్షేమ ఫలాలు ద్వారా దేశ అభివృద్ధికి తోడ్పడాలని మించల ప్రదీప్ కోరారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మించల ప్రదీప్ మిత్రులు శ్రేయోభిలాషులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలపడంతో పాటు మించల ప్రదీప్ ను శాలువా పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

టీడీపీ సభ్యత్వ నమోదు విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-తొట్టంబేడు: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షులు గాలి మురళినాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు 2024-26 మధ్య కాలానికి సభ్యత్వం చేస్తున్నారన్నారు. శాశ్వత సభ్యత్వం కోసం రూ.లక్ష, క్రియాశీలక సభ్యత్వం కోసం రూ.100 చెల్లించాలన్నారు. మొబైల్ ఫోన్, కంప్యూటర్, వాట్సప్, టెలిగ్రామ్ వీటిలో ఏదో ఒకదాని ద్వారా లింకు చేసుకుని ఆన్ లైన్ లోనే సభ్యత్వం తీసుకోవచ్చన్నారు. పాత సభ్యత్వం రెన్యూవల్ చేసుకోవచ్చన్నారు. పార్టీకి విరాళాలు కూడా అందించవచ్చన్నారు. ఈ సభ్యత్వం తీసుకున్నవారికి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు రూ.5 లక్షలచయ పరిహారం ఇస్తారన్నారు. మండలంలో సభ్యత్వం చేసుకోవడానికి పంచాయితీలకు ఒక షెడ్యూలు ప్రకారం టీం ను ఏర్పాటు చేశామన్నారు.

రైతు సంక్షేమమే టిడిపి ప్రభుత్వం ధ్యేయం: ఎమ్మెల్యే థామస్

- 6 కోట్లతో బిందు సేద్యం పరికరాలు అందచేత

విశాలాంధ్ర-కార్వేటినగరం: అన్నదాతల సంక్షేమమే టిడిపి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వి ఎం థామస్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో 90 శాతం రాయితీతో 6 కోట్లు విలువైన బిందు సేద్యం పరికరాలను రైతులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం టిడిపి సర్కార్ వాట ్ల సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ హాయంలో అక్రమ కేసులు అవినీతి తప్ప అభివృద్ధి శూన్యమని విమర్శించారు. రైతులకు అండగా ఉండే ప్రభుత్వం టిడిపి ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జ్ పొన్న యుగంధర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, ఏటీఎంఐపి పిడి బాలసుబ్రమణ్యం, మండల పార్టీ అధ్యక్షులు చెంగలరాయల యాదవ్, కార్యదర్శి రాజేంద్రరెడ్డి ఇంచార్జ్, ఎంపీడీవో విద్యావతి, టిడిపి నాయకులు

రవిరాజు, అన్నారెడ్డి రమేష్రెడ్డి, చంద్రమౌళి రెడ్డి,ఢిల్లీ బాబు రెడ్డి శ్రీనివాసులు యాదవ్, లోకం నాదం శెట్టి, డ్రిప్ ప్రతినిధులు సిగ్నెట్ కంపెనీ శివారెడ్డి, ఫ్లాటక్ కంపెనీ సాగర్, జ్యోతి యాదవ్, సంపత్, హేమాద్రి, మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-గుడిపాల: తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ శనివారం ప్రారంభించారు. 100 రూపాయల సభ్యత్వంతో రూ.5 లక్షల మేర బీమా సౌకర్యం కల్పించేలా టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన చంద్రబాబు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం రుసుము ఒక రూపాయి నుంచి ఆరంభమై నేడు 100 రూపాయలకు చేరిందని చంద్రబాబు అన్నారు. టీడీపీ మెంబర్ షిప్ తీసుకోవడం సమాజంలో ఒక గౌరవం, గుర్తింపుగా మారిందన్నారు. రూ.100 ల తో రూ.5 లక్షల ప్రమాద బీమా టీడీపీ సభ్యత్వం నమోదులో రూ. లక్ష కట్టిన వారికి శాశ్వత సభ్యత్వం అందించనున్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకొన్న వారికి.. గతంలో రూ.2 లక్షలుగా ఉన్న ప్రమాద బీమా సదుపాయాన్ని రూ.5 లక్షలకు పెంచారు. అలాగే టీడీపీ సభ్యత్వ కార్డు ఉన్న వ్యక్తి మరణించిన రోజే అంత్యక్రియలకు రూ.10 వేలు అందించనున్నారు. కావున ఈ సధావకాసాన్నిఅందరు సద్వినియోగ పరుచు కొని సభ్యత్వం నమోదు చేసుకోవాలని శాసన సభ్యులు శ్రీ గురజాల జగన్ మోహన్ కోరారు. ఈ కార్యక్రమం లో శాసన సభ్యులు శ్రీ గురజాల జగన్ మోహన్, ఎం.పీ దగ్గుముల్ల ప్రసాదరావు, తెలుగుదేశ పార్టీ జిల్లా అధ్యక్షుడు సి.ఆర్ రాజన్, ఎక్స్ ఎమ్మెల్యే గాంధీ, చిత్తూరు ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎ పీటర్, గుడిపాల మండలం తెలుగుదేశ పార్టీ అధ్యక్షుడు చలి చీమల సుబ్రహ్మణ్యం నాయుడు, ఎవస్ మనోహర్, గిర్వాణి చంద్రప్రకాష్, బాలాజి నాయుడు, జి.జే.ఎం చారిటబుల్ ట్రస్ట్ అధినేత గురజాల చెన్నకేశవ నాయుడు, తదితరులు, పార్టీ కార్యకర్తలు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

రాజనాల బండపై ప్రమాణాల జోరు

విశాలాంధ్ర-చౌడేపల్లి: సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల బండ పై శనివారం ప్రమాణాల జోరు కొనసాగింది టీటీడీ అధికారులు ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రసన్న ఆంజనేయస్వామి శ్రీ లక్ష్మీనరసింహస్వామి లకు విశేష పూజలు జరిగాయి కొందరు అనుమానితులు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదా వేసుకుని వెళ్లారు ఆలయ ప్రాంగణంలో ప్రధానార్చకుడు కృష్ణమూర్తి స్వామి వారి మహిమలను భక్తులకు వివరించారు రాష్ట్రం తో పాటు తమిళనాడు కర్ణాటకలో నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలిరావడంతో రాజనాల బండపై భక్తుల సందడి నెలకొంది.

గ్రామ సభలను సద్వినియోగ పరచుకోండి

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలం లో ఈ శనివారం జరిగిన గ్రామా సబలు లో భాగంగా కృష్ణజమ్మాపురం రెవిన్యూ చేపట్టా రు. గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రీ సర్వే కార్యక్రమంలో జరిగిన అవకతవకలను తిరిగి సవరించు కొని వెసులుబాటును ప్రస్తుతం గ్రామ సబల ద్వార పరిష్కరించు కోవచ్చని తహసిల్దార్ పేర్కొన్నారు. ఈ కృష్ణజమ్మాపురం రెవిన్యూ గ్రామా సబల లో 13 వినతులు అందాయని, ఆ వినతులకు సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తామని తహసిల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ రూప రాణి, మండల సర్వేయర్ గోపి, కమ్యూనిటీ సర్వేయర్ కిరణ్, వీఆర్వో యం నాగరాజులు నాయుడు, గ్రామ సర్వేయర్ యం సరిత, మరియు రెవిన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వేలు

విశాలాంధ్ర-కార్వేటినగరం: భూ సమస్యలను పరిష్కరించేందుకే రీ సర్వేలు నిర్వహించడం జరిగిందని మండల తహసీల్దార్ భగవతి అన్నారు. శనివారం మండల పరిధిలోని కేశవకుప్పం సచివాలయ ఆవరణంలో నిర్వహిం చిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో చేపట్టిన రీసర్వేలో లోపాలను గుర్తించడానికి గ్రామ సభలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. రీసర్వేలో లోటు పాటులు ఉంటే మళ్లీ అధికారులు దృష్టికి తీసుకొచ్చి సవరణ చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ స్వరూపరాణి, మండల సర్వేయర్ బాబు, వీఆర్వో గోపి, విలేజ్ సర్వేయర్ చరణ్ తేజ,సర్పంచ్ జ్యోతి, నాయకులు రవిరాజు, దొరస్వామిరాజు, లక్ష్మణరాజు పలువురు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి - ఏవో భారతి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత మరియు జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి, ప్రభుత్వ అధికారుల నియంత్రణలో పౌరులకు ప్రాముఖ్యమైన సమాచార సురక్షితంగా ఉంచడానికి సమాచార హక్కు యొక్క ఆచరణాత్మక పాలనను ఏర్పాటు చేయడానికి ఒక చట్టం, కేంద్ర సమాచార కమిషన్ రాజ్యాంగం మరియు రాష్ట్ర సమాచార కమిషన్లు మరియు వాటికి సంబంధించిన విషయాల కోసం సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందని వ్యవసాయ శాఖ అధికారి భారతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, ఫర్టిలైజర్స్ డీలర్లకు, సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మండల స్థాయిలో క్షేత్రస్థాయి సమాచారం అందించడానికి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ప్రజలు అడిగిన సమాచారాన్ని అధికారులు వారికి అందించే విధంగా అవగాహన కలిగి ఉండాలన్నారు.మరియు ప్రజాస్వామ్యానికి సమాచార పౌరసత్వం మరియు దాని పనితీరుకు కీలకమైన సమాచారం మరియు అవినీతిని అరికట్టడం మరియు ప్రభుత్వాలు మరియు వాటి సాధనాలను పాలించిన వారికి జవాబుదారీగా ఉంచడం అవసర మన్నారు. పరిమిత ఆర్థిక వన రుల యొక్క వినియోగం మరియు సున్నితమైన సమాచారం యొక్క గోప్యతను కాపాడటం వంటి ఇతర ప్రజా ప్రయోజనాలతో విభేదించే అవకాశం ఉందన్నారు. ప్రజా ప్రయోజనాలు గోప్యతతో అధికారులు వ్యవహరించాల న్నారు. సెక్షన్ 6,7(1) ప్రకారం సమాచార కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 30 రోజులు లోపల పూర్తిస్థాయిలో సమాచారం పరిష్కరించాలన్నారు. సెక్షన్ 4(1)(సి) ప్రకారం కార్యాలయం ఆవరణలో బోర్డు ఏర్పాటు చేసి అందులో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అథారిటీ అధికారి పేరు, మొబైల్ నెంబర్ స్పష్టంగా తెలిసే విధంగా ముద్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటాం : డాక్టర్ శ్రీపతిబాబు

విశాలాంధ్ర-సత్యవేడు: టిడిపి కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటామని తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శ్రీపతిబాబు స్పష్టం చేశారు. శనివారం సత్యవేడు పార్టీ కార్యాలయ ప్రాంగణంలో టిడిపి మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా మాజీ టిడిపి మండల అధ్యక్షుడు పరమశివం, బాలరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీపతి బాబు మాట్లాడుతూ టిడిపికి మూల స్తంభాలు కార్యకర్తలే అన్నారు. గడచిన ఐదేళ్లలో ఎంతోమంది కార్యకర్తలు ప్రభుత్వ అణిచివేతకు గురైన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. నాటి నుంచి నేటి వరకు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం అన్నారు. ఈ నేపథ్యంలోనే టిడిపిలో సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు గతంలో ఉన్న రెండు లక్షల ప్రమాద బీమాను ఐదు లక్షలకు పెంచినట్లు ఆయన గుర్తు చేశారు. దీంతోపాటు సహజ మరణానికి కూడా పది వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, ప్రభాకర్ రెడ్డి, శశి మోహన్ నాయుడు, లోకయ్య రెడ్డి, మురళి (కోళ్ల చిన్న), గణేష్,కాశీప్రతాప్ రెడ్డి, మోహన్, షణ్ముగం, హేమభూషణం, ప్రదీప్, వినాయకం, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-రామకుప్పం: మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి మరియు తెలుగుదేశం పార్టీ మేజర్ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు తెలుగు దేశం పార్టీ ప్రజలకు అందుబాటులో ఉండి వారి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆనంద రెడ్డి, సీతాపతి, మునస్వామి, చిన్నికృష్ణ, చలపతి, మహమ్మద్ రఫీ, నియాజ్ అహ్మద్, మంజునాథ్, ఆదిల్ బాషా, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రెస్ క్లబ్ ఎన్నికలలో గెలిచిన జర్నలిస్టులకు అభినందనలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ప్రతిష్టాత్మకంగా జరిగిన తిరుపతి ప్రెస్ క్లబ్ ఎన్నికలలో యాదవ యువకిశోరం సంయుక్త కార్యదర్శిగా 235 ఓట్లతో ఎన్నికైన విజయ్ యాదవ్ అలియాస్ చెంచు బత్తయ్యను అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు అన్నా రామచంద్రయ్య యాదవ్, కార్పొరేటర్ అనిత యాదవ్ శంకర్ యాదవులు ఘనంగా సన్మానించారు. తిరుపతి నగరంలో శనివారం కేటీ రోడ్ లోని కార్యాలయంలో కార్పొరేటర్ అనితా యాదవ్, శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నా రామచంద్ర యాదవ్ దుశ్శాలువతో ఘనంగా సత్కరించి పుష్పాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకం గా జరిగిన తిరుపతి ప్రెస్ క్లబ్ ఎన్నికలలో గెలుపొందిన జర్నలిస్టులకు అన్నా రామచంద్రయ్య యాదవ్ అభినందనలు తెలిపారు. అలాగే కార్పొరేటర్ అనిత యాదవ్ మాట్లాడుతూ తిరుపతి ప్రెస్ క్లబ్ ఎన్నికలలో గెలిచిన జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సభ్యులకు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ యాదవ్, ముని యాదవ్, భాస్కర్ యాదవ్, పెద్ద ఎత్తున యువత పాల్గొన్నారు.

ఏఐటీయుసి వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు యస్ నాగరాజు

విశాలాంధ్ర-చిత్తూరు: ఏఐటీయుసి వ్యవస్థాపన దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని జిల్లా ఏఐటి యుసి గౌరవ అధ్యక్షులు నాగరాజు పిలుపునిచ్చారు. చిత్తూరు నియోజక వర్గం ఏఐటీయుసి అనుబంధ కార్మిక సంఘాల నాయకుల సమావేశం కే.రమాదేవి అధ్యక్షతన శనివారంజరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ చిత్తూరు జిల్లా గౌరవ అధ్యక్షులు యస్. నాగరాజు మాట్లాడుతూ భారతదేశంలోని మొట్ట మొదటిగా 1920 అక్టోబర్ 31న తేదీన ఏఐటియుసి సంఘం ఏర్పడి నాటి నుడి నేటి వరకు కార్మికుల సమస్యల పైన నిరంతరం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న సంఘం అన్నారు. ఆనాడు కార్మికులు 16 గంటలు 20 గంటలు పని చేస్తున్న రోజుల్లో ఏఐటియుసి కార్మికుల పక్షాన ఉంటూ సమస్యల పరిష్కారం కోసం బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి న ఏకైక యూనియన్ ఏఐటీయూసీ పని గంటల కోసం ,వారి హక్కుల కోసం కార్మికుల చట్టాల కోసం భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని త్యాగాలు చేసిన ఘనత ఏఐటియుసి కార్మిక సంఘానికి ఉందన్నారు ఇలాంటి త్యాగాలు చేసి కార్మికుల పక్షాన ఉంటున్న ఏఐటియుసి 105 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని దీపావళి పండుగ వలే ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చిత్తూరు నియోజకవర్గం ఏఐటీయూసీ గౌరవ సలహాదారులు కె.మణి, వి.సి.గోపినాథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రమాదేవి ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు ఎం.విజయ కుమార్, సుబ్రహ్మణ్యం, రజిని కుమార్, జయశంకర్, సురేష్, ఈశ్వరన్, కృష్ణన్, డేవిడ్, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాలలో నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాల, సూళ్లూరుపేట మరియు విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (నీతిఆయోగ్ తో గుర్తింపు పొందిన) మధ్య నైపుణ్య శిక్షణ మరియు ఉపాధి అవకాశాల కోసం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఎస్సి ఇండియా సలహాదారు వై.రామ్మోహన్ రావు, గోకుల కృష్ణ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్‌తో కలిసి అవగాహన పత్రాలను మార్పిడి చేసుకున్నారు. ఈ ఒప్పందంతో ఎస్సి మరియు ఎస్టి విద్యార్థులకు సి-డాక్ మరియు ఐ.ఇ.ఇ.ఇ సహకారంతో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతికత మీద ఉచిత శిక్షణ అందించబడుతుంది. అదనంగా, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు ద్వారా 3డి ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్ మరియు ఐఓటి వంటి ఆధునిక సాంకేతిక కోర్సులు కూడా అందించబడతాయి. వాధ్వాని ఫౌండేషన్ తో కలిసి 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలు మరియు పారిశ్రామిక వ్యవస్థాపకత శిక్షణ కూడా ఇవ్వబడుతుందని వై.రామ్మోహన్ రావు తెలిపారు. కళాశాల చైర్మన్ గిలక బ్రహ్మయ్య, కార్యదర్శి శ్రీనివాస బాబా మరియు కోశాధికారి ఎంఎం కొండయ్య విద్యార్థులకు కళాశాల సౌకర్యాలను వినియోగించుకుని భావి భారత పౌరులుగా పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలగాని పవన్ కుమార్, ఐ.క్యు.ఏ.సి కోఆర్డినేటర్ పి.కే. దేవి బాల, ప్లేసమెంట్ ఆఫీసర్ శివ కుమార్, స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ కవిత, గుర్రం మనోహర్ మరియు ఇతర అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

శ్రీ సిద్దేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాని

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: యర్రావారిపాళ్యం మండలం, తలకోన లో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి వారి దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులను అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు పార్టీ నాయకులు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు కండువా కప్పి, పూలమాలతో సత్కరించి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యుల పేరు మీద, పులివర్తి నాని కుటుంబ సభ్యుల పేరు మీద అర్చన చేయించారు. ఆయురారోగ్య, ఐశ్వర్యాలతో, దీర్ఘాయుష్మతో జీవించాలని ఆలయ అధికారులు దీవించారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందించారు. అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు, మండల నాయకులతో కలిసి కార్తీక మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు చేసిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచాలని బ్లీచింగ్ చల్లడం ట్యాంకులు శుభ్రం చేయడం తాగడానికి మంచినీరు వంటి సౌకర్యాలను దగ్గరుండి పర్యవేక్షించాలని అధికారులకు తెలిపారు. ఆలయ సమీపంలో ఉన్న కోనేరు పునర్నిర్మాణానికి నిధులను అంచనా వేయించారు. తొందరలోనే పనులు ప్రారంభించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

విశాలాంధ్ర-యర్రావారిపాళ్యం: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. యర్రావారిపాలెం మండలం, నెరబైలు పంచాయతీకి చేరుకున్న ఎమ్మెల్యేకి శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. మహిళలు మంగళ హారతులతో, యువకులు గుమ్మడికా యతో దిష్టి తీసి గ్రామంలోకి ఆహ్వానం పలికారు. టిడిపి అధినేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అక్టోబర్ 26వ తేదీన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వం శ్రేణులకు ఎంతగానో ఉపయోగపడు తుందని, నూతన సభ్యత్వ విధానంలో సభ్యత్వం చేసుకున్న వారికి, 100 రూపాయలతో రెండు సంవత్సరాల సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా రూ.5 లక్షలు రూపాయలు కుటుంబ సభ్యుల అవసరాల కోసం ప్రమాద బీమా వస్తుందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని టిడిపి కార్యకర్తలకు అభిమానులకు సానుభూతి పరులకు పార్టీ సభ్యత్వ నమోదు పై అవగాహన కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. టిడిపి సభ్యుల సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు భరోసా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతరులు పాల్గొన్నారు.

కరాటే గ్రేడింగ్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్ల ప్రధానం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని మినీక్రీడా స్టేడియంలో జరిగిన కరాటే గ్రేడింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. శనివారం సత్యవేడు భువనేశ్వర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జపాన్ తొమ్మిదవ కరాటే డాన్ మాస్టర్ వతనబీ, ఏడవ బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ విల్సన్ రాబర్ట్ మిల్లర్ అధ్యక్షతన నాల్గవ బ్లాక్ బెల్ట్ కరాటే మాస్టర్ భువనేశ్వర్ పర్యవేక్షణలో కరాటే గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ మంజుల రమేష్, ఏఐఏపిఎల్ఎఫ్ నాయకుడు రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు. కరాటే గ్రేడింగ్ పోటీలకు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఒకటవ బ్లాక్ బెల్ట్ కరాటే విజేతలుగా పదిమంది విద్యార్థులు, రెండవ బ్లాక్ బెల్ట్ కరాటే విజేతలుగా ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ఈ సందర్భంగా స్థానిక కరాటే అకాడమీ మాస్టర్ భువనేశ్వర్ పేర్కొన్నారు. గ్రేడింగ్లో విజేతలైన విద్యార్థులందరికీ జపాన్ 9వ కరాటే బ్లాక్ బెల్ట్ మాస్టర్ వతనబీ, ఏడవ బ్లాక్ బెల్ట్ మాస్టర్ విల్సన్ రాబర్ట్ మిల్లర్ తదితరులు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. అంతకు మునుపు శ్రీకళ్యాణ వీరభద్ర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న తర్వాత ర్యాలీగా బయలుదేరి గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అక్కడినుంచి ర్యాలీగా బయలుదేరి మినీ స్టేడియం వద్దకు చేరుకోవడంతో కరాటే గ్రేడింగ్ పోటీలు జరిగింది.

ఆన్‌లైన్‌లో టిడిపి సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టిడిపి సభ్యత్వ నమోదు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, టిడిపి సభ్యత్వం రూ.100 పెట్టి తీసుకుంటే వారికి రూ.5 లక్షలు ప్రమాద భీమా వర్తింపచేయనున్నట్లు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి తెలిపారు. జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో లాంచనంగా ప్రారంభించిన సందర్భంగా నాయకులతో కలిసి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి శనివారం ఏర్పేడు మండలం ఏర్పేడు పంచాయతీలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా కార్యకర్తల కోసం, ప్రజల కోసం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. వంద రూపాయలు చెల్లించి ఆన్లైన్లో సభ్యత్వం పొందిన వారు మరణిస్తే ఇన్సూరెన్స్ కింద అంత్యక్రియలకు రూ.10 వేలు, భీమా కింద రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి, పార్లమెంట్ బీసీ ఉపాధ్యక్షులు రాచేటి సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు నిరంజన్, సదాశంకర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, గోపి తదితరులు పాల్గొన్నారు.

కమతమూరులో తెదేపా సభ్యత్వం నమోదు

విశాలాంధ్ర-కుప్పం: ఏపిఎస్ఆర్టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో కమతమూరులో పార్టీ క్రియాశీల సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం గురించి ఏపిఎస్ఆర్టిసి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తలారా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఒక్కరూ రూ. 100తో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకోండి. 5 లక్షల వరకు ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్యా, ఉద్యోగ, వైద్య సహాయం అందుతుంది. దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన ఘన చరిత్ర మన తెలుగుదేశం పార్టీది. సభ్యత్వం తీసుకోండి. టిడిపి కార్యకర్తను అని ఘనంగా చాటండి అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఎం పిఏ మనోహర్ మున్సిపాలిటీ అధ్యక్షులు రాజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, మహిళలు, ఐటిడిపి సభ్యులు, తెలుగు యువత సభ్యులు, తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ జగన్నాథ రాజు మృతి కేసులో పది మంది అరెస్ట్

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: పాలసముద్రం మండలం నరసింహపురం టిడిపి ఎంపీటీసీ జగన్నాథరాజు కిడ్నాప్ గురై ఆ తర్వాత మృతి చెందిన కేసులో గంగాధర నెల్లూరు పోలీసులు10 నిందితులను అరెస్టు చేశారు. ఈ మేరకు గంగాధర నెల్లూరు సిఐ లక్ష్మీనారాయణ శనివారం సాయంత్రం ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పాలసముద్రం మండలం నరసింహపురం పంచాయతీ టీబీఎన్ఆర్ పురం గ్రామానికి చెందిన టిడిపి ఎంపీటీసీ జగన్నాథరాజు తోపాటు అతని స్నేహితులు చిన్నమ రాజు, ఏకాంబరంతో కలిసి కారులో డ్రైవర్ శంకర్ తో ఈనెల 21వ తేదీ సాయంత్రం గంగాధర నెల్లూరు మండలం అంబోదరపల్లి సమీపంలో ప్రయాణం సాగిస్తుండగా, వారి వెనకాలే మూడు కార్లులో కొందరు వ్యక్తులు వెంబడించి అడ్డగించారు. ఆ వ్యక్తులు ముందుగా జగన్నాథరాజును వారి కారులో నుండి బలవంతంగా దింపి కిడ్నాపర్ల కారులోకి ఎక్కించారు. అదేవిధంగా ఏకాంబరం, చిన్నమ రాజు, శంకర్లను సైతం మరో వేరు వేరు రెండు వాహనాల్లో ఎక్కించుకొని. కిడ్నాపర్లు ఆ మూడు కార్లను సమిసిరెడ్డిపల్లి వరకు ప్రయాణించారు. ఆ గ్రామం వద్దకు రాగానే కిడ్నాపర్లు వారి కారులో నుండి ఏకాంబరం, చిన్నమరాజు, శంకర్ లను దించేసి అక్కడి నుండి జగన్నాథరాజును మళ్లీ గంగాధర నెల్లూరు మీదుగా నూజివీడు కు తరలిస్తుండగా, ఈనెల 22వ తేదీ తెల్లవారుజామున జగన్నాథరాజును వాహనాల నెలసరి కంతులు కట్టాలని లేదంటే వాహనాలను తమకు స్వాధీనం చేయాలని కిడ్నాపర్లు ఒత్తిడి చేశారు. దీంతో జగన్నాథరాజు తీవ్ర ఒత్తిడికి లోనై కాలకృత్యాలకు వెళ్లి వస్తానని చెప్పి దిగి పక్కనున్న పొలాల్లో కి పారిపోయాడు. కొంత దూరం పోయిన తర్వాత స్పృహ తప్పి పడిపోయి ఉండటాన్ని గమనించిన కిడ్నాపర్లు నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా చనిపోయాడని కిడ్నాపర్లు డ్రైవర్ శంకర్ కు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు జగన్నాథరాజు భార్య రాధిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిపై నిఘా ఉంచామన్నారు. ఈ కేసులో ప్రధానంగా జెసిబి యంత్రాలు విక్రయాలు సాగించే ఏజెంట్లు అయినా ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం కు చెందిన లక్కోజి సతీష్, అదేవిధంగా అనపర్తి అనిల్ కుమార్, ల ద్వారా జగన్నాథ రాజు ఫైనాన్స్ జెసిబి పోర్టు కారు తీసుకుని కంతులు వాయిదాలు కట్టకుండా పెండింగ్ పెట్టేసాడని కారణంతో ఏజెంట్లు ఈ కిడ్నాప్ కు పాల్పడినట్లు చెప్పారు. జగన్నాథరాజును కిడ్నాప్ చేయడంతో పాటు ఆ తర్వాత అతను మృతికి కారణమైన ఈ కేసు లో నిందితులైన కర్నూలు జిల్లా కనకవేడుపేటకు చెందిన బోయ వీరేష్ (22), అదేవిధంగా మునగాల గ్రామానికి చెందిన దాసరయ్య గారి పెద్దయ్య (48), ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రాయపాడుకు చెందిన గుత్తి నాగరాజు (34), అదేవిధంగా భీమడోలు గ్రామానికి చెందిన దాసరి చంద్రయ్య(43), అలాగే చోడవరం గ్రామానికి చెందిన గొర్రెల సత్య బాబు (24), శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం చిన్నయ్యపేట గ్రామానికి చెందిన మణికంఠ (26), విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చౌడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన గుడివాడ ఆదర్శ్ (20), అదేవిధంగా గుడివాడ మణికంఠలను (22) ,ఈస్ట్ గోదావరి జిల్లా రాజానగరం మండలం పాలచర్ల గ్రామానికి చెందిన భావిశెట్టి శివసత్యనారాయణ(27), అదేవిధంగా నల్లజెర్ల మండలానికి చెందిన అనిల్ కుమార్ లను 26 తేదీన చిత్తూరు కట్టమంచి చెరువు వద్ద అరెస్టు చేశామని, వారు ప్రయాణించిన కార్లను పూతలపట్టు సమీపంలోని బృందావన్ హోటల్ వద్ద పార్కింగ్ చేసిన వాటిని స్వాధీనం చేసుకున్నామని సీఐ ప్రెస్ నోట్‌లో తెలిపారు. కాగా ఈ కేసు లో సీఐ లక్ష్మీనారాయణతో పాటు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ అభినందించారు.

విమర్శలు ప్రతి విమర్శలు

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. టిడిపి నాయకుడు బెన్నీ, టిడిపి మండల ప్రెసిడెంట్ సంచి కృష్ణయ్య మాట్లాడుచూ వైయస్సార్సీపి నాయకుడు మాజీ ఎన్ డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పై అవాకులు చవాకులు విసిరాడు. సత్యనారాయణ రెడ్డి తెలుగుదేశం పార్టీకి సీనియర్ నాయకుడు గంగా ప్రసాదు, ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు ను విమర్శించే స్థాయి నీది కాదని, నీ ప్రవర్తన మార్చుకోకపోతే సహించేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రాజారెడ్డి, శేఖర్ నాయుడు, ప్రసాద్ నాయుడు, మల్లికార్జున్ రెడ్డి, మాధవరెడ్డి, యుగంధర్, సిద్దుల నాయుడు, గురవయ్య తదితరతులు పాల్గొన్నారు.

పండుగలా తెలుగుదేశంపార్టీ సభ్యత్వనమోదు

విశాలాంధ్ర-నాయుడు పేట: సూళ్ళూరుపేట నియోజకవర్గ శాసనసభ్యు రాలు నెలవల విజయశ్రీ శనివారం నాయుడుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమా నికి నియోజకవర్గ పరిధిలో 6 మండలాల పార్టీ కార్యకర్తలు, పార్టీకార్యాలయం వద్దకు చేరుకోవడంతో అక్కడ పండుగ వాతావ రణం నెలకొంది. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీఆదేశాలు మేరకు, శనివారం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సభ్యత్వం నమోదు ప్రారంభించా మన్నారు. పాతసభ్యత్వం రెన్యూవల్ తోపాటు కొత్తగా పార్టీ సభ్యత్వం కోరుకునే వ్యక్తులకు, కొత్తసభ్యత్వం నమోదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ పార్లమెంటు సభ్యులు నెలవల సుబ్రహ్మణ్యం, జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, నాయుడుపేట మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డి, రఫీ, నెలవల రాజేష్, ఓజిలి మండల అధ్యక్షుడు విజయకుమార్ నాయుడు, తడమండల పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి మురళిరెడ్డి, పెళ్లకూరు మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిప్రసాద్ హత్యకేసులో 14 మంది అరెస్టు

విశాలాంధ్ర-చిల్లకూరు: తిరుపతి జిల్లా, గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం, చిల్లకూరు మండలం ముత్యాలపాడు గ్రామ పంచాయతీ ముత్యాలపాడు మరియు నాంచారమ్మ పేట గ్రామాలలో ఈ నెల 21 మరియు 22 తేదీలలో జరిగిన ఘటనలు, తెలుగుదేశం పార్టీకి చెందిన మల్లారపు హరిప్రసాద్ హత్య కేసు లో యస్ సి, యస్ టి చట్టం తో పాటు వివిద సెక్షన్ ల క్రింద మూడు కేసులు మరియు ఒక హత్య కేసు వివిధ సెక్షన్ ల క్రింద నమోదు చేసి 14 మంది ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగింది అని , తిరుపతి జిల్లా లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ కే. రవి మనోహర ఆచారి శనివారం చిల్లకూరు పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన నాయకులు మరియు అగ్ర వర్ణానికి చెందిన కొంతమంది వ్యక్తులు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా కుట్ర పన్ని , నాంచారమ్మ పేటకు చెందిన హరిజనవాడ లో కొంతమంది తో కలసి హత్య మరియు కొన్ని ఘటనలలో భాగస్వామ్యం తో నేరపూరిత చర్యలు మరియు హరిప్రసాద్ హత్యకు పాల్పడ్డారు అన్నది ఎలాంటి సందేహానికి తావు లేకుండా జరిగింది అని గూడూరు డిఎస్పీ వివి రమణకుమార్ తెలిపారు. అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఏర్పాటు చేసిన టీములు ఈ కేసును అన్ని కోణాలలో తమ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లుగా చెప్పారు. చట్టాలను ఉల్లంఘించేవారిని ఉపేక్షించేది లేదన్నారు. పరారీలో ఉన్న మిగిలిన ముద్దాయిలను త్వరలో అరెస్ట్ చేస్తామన్నారు. నేరాలలో పాల్గొన్న అందరిపై రౌడీ షీట్లు తెరవబడతాయని చెప్పారు. ఈ సమావేశంలో నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబుసిఐలు కిశోర్ బాబు, శేఖర్ బాబు, శ్రీనివాస్, బాబీ, హుసేన్ బాషా, మురళీ క్రిష్ణ చిల్లకూరు ఎస్ ఐ రమేష్ బాబు, రూరల్ ఎస్ ఐ మనోజ్ కుమార్, చిల్లకూరు పోలీసు స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబం పై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర -పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం పెద్ద చెల్లారగుంట పంచాయతీ తాతిరెడ్డిపల్లి గ్రామంలో దళితులపై దాడి చేసిన పెత్తందారి అశోక్ కుమార్, అతని రౌడీ మూకలపై అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని జాతీయ మానవ హక్కులు మరి అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నం, శివన్న డిమాండ్ చేశారు. అందులో భాగంగా శనివారం పలమనేరు పట్టణంలో గల మానవ హక్కుల కార్యాలయం నందు గుర్రం సుబ్రమణ్యం అధ్యక్షతన ఈ విషయంపై సమావేశం నిర్వహించి ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళిత కుటుంబానికి చెందిన సర్వేనెంబర్ 174/2 లో 1.24 సెంట్లు పూర్వీకుల నుండి సంక్రమించిన భూమిని సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వారని తెలిపారు. సదరు భూమి కోసం దళితులు అనేక పర్యాయాలు మండల తహసిల్దార్ కార్యాలయాలు తిరిగి అలసిపోయి, నిరసన కార్యక్రమాలు చేపట్టినా రెవిన్యూ అధికారులకు చీమకుట్టినంత చలనం లేకపోవడం దుర్మార్గమన్నారు. అదే గ్రామానికి చెందిన పెత్తందారి అశోక్ కుమార్ రెవెన్యూ అధికారులకు డబ్బులు, పలుకుబడిని ఎరచూపి దళితులు సాగు చేసుకుంటున్నా భూమిని గౌరమ్మ పేరు మీద పాసుబుక్కులు చేయడం, సరికాదన్నారు. మహిళలుపై పైశాచికంగా దాడి చేసి జెసిబి తో తొక్కించాలని ప్రయత్నం చేయడం చూస్తుంటే ఇదంతా రెవిన్యూ అధికారుల వైఫల్యాల వలనే దాడులు జరుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి అవినీతితో అడ్డదారుల్లో గౌరమ్మ పేరున మంజూరు చేసిన పాస్ బుక్కులను రద్దుచేసి, దళిత కుటుంబానికి అప్పజెప్పాలని లేనిపక్షంలో రెవిన్యూ అధికారుల ఆగడాలను ఎండ కడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రత్నమ్మ, భూదేవి, ఆనంద్, వెంకటేష్, వెంకటరమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మామిడి పూత మరియు పిందె దశలో చేపట్టవలసిన సస్య రక్షణ పై అవగాహన

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు మండలం లోని ఆర్‌డిఓ ఆఫీసు మీటింగ్ హాల్ నందు కుప్పం, గుడుపల్లి, శాంతీ పురం,రామకుప్పం, వీ కోట, బైరెడ్డి పల్లి, పలమనేరు, మండలాల రైతుసేవా కేంద్ర సిబ్బంది కి ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో శనివారం మామిడిలో పూత మరియు పిందె దశలో చేపట్టవలసిన సస్య రక్షణ పై ముందుగానే రైతులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యముతో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉద్యాన అధికారి డా. డి . మధు సూదన రెడ్డి హాజరు అయ్యారు,అలాగే డి ఆర్ సి, ఏడి ఎ ,విజయశంకర్ రెడ్డి, డిఆర్‌సి,ఏఓ పద్మజ, ఉద్యాన అధికారి లక్ష్మీ ప్రసూన, శాంతి పురం ఉద్యాన అధికారి వింధ్య మరియు రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మామిడిలో పూత కాలం మొదలవుతున్న క్రమం లో , డిసెంబర్ రెండవ వారంలో పూత అంతా ఒకే సారి రావడా నికి పొటాషియం నైట్రేట్ (13:00:45) 5 గ్రా మరియు అర్కా మాంగో స్పెషల్ 5గ్రా /లీ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.పూ మొగ్గ దశలో ఆశించే ప్రధాన పీడ , పీడలు మరియు వాటి నివారణ చర్యల పై అవగాహన కల్పించారు.పూ మొగ్గ దశ లో మొదటి దఫా క్లోరో పైరిఫోస్ 2 మి.లి మరియు మాంకోజెబ్ 2గ్రా /లీ నీటికి కలిపి పిచికారి చేయాలి. పచ్చి పూత దశ లో బ్యుప్రో ఫెజిన్ 1.5 మి లీ ం హెక్సా కో నజోల్ 2 మి లీ అజాడిరాక్టిన్ 2 మి లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తెల్ల పూత దశలో ఎలాంటి మందులు స్ప్రే చేయరాదన్నారు. నల్ల పూత దశలో బ్యుప్రో ఫెజిన్ ం అసిఫేట్ 1గ్రా /లీ ం థయోఫినేట్ మిథైల్ 1గ్రా /లీ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కాయలు వృద్ధి చెందే దశ లో నిమ్మ కాయ సైజ్ ఉన్నపుడు కాయలకు కవర్లు కట్టడం వలన నాణ్యమైన కాయలు పొంది మంచి ధర పొందే అవకాశం ఉందని సూచించారు.

విద్యా ప్రమాణాల పెంపునకు సంఘటితంగా కృషిచేద్దాం

- తిరుపతి జిల్లా నూతన డీఈవో కె.వి.ఎన్ కుమార్

విశాలాంధ్ర -తిరుపతి: జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారి గా నియమితులైన కెవిఎన్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించిన నంతరం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టియు)నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో సంఘటితంగా కృషిచేసి తిరుపతి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడానికి సహకరించాలని కోరారు. నూతన ప్రభుత్వం విద్యారంగానికి విశేష ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు,జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు ప్రధాన కార్యదర్శి జగన్నాథం అసోసియేట్ అధ్యక్షులు మునికృష్ణ నాయుడు,రాష్ట్ర కౌన్సిలర్ వేణుగోపాల్,జిల్లా కార్యదర్శులు కృష్ణమనాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ శేఖర్, రమాదేవి డివిజనల్ కన్వీనర్ వాసు మహిళా కన్వీనర్లు రేణుకాదేవి, ద్రాక్షాయిని తిరుపతి అర్బన్ మండల నాయకులుమురళి, రమేష్ నాయక్,మనోహర్, రియాజ్,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో నందమూరి రామకృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం నందమూరి రామకృష్ణ కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నేతలు వీరికి దక్షిణ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజ యస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచ నం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ ఏఈవో సతీష్ మాలిక్, సూపరిడెంట్ నాగభూషణ్ యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్, ఏపీఆర్ఓ రాజేష్ ,టీడీపీ నేతలు రంగినేని చెంచయ్యనాయుడు, విజయకుమార్, నెమళ్లూరు బుజ్జి, హరి, జయ ప్రకాష్, బాలాజీరెడ్డి, ఖాదర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసీపీకి మరో అవకాశం వద్దు

-మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్రంలో వైసీపీకి మరోసారి అవకాశం వస్తే 50 సంవత్సరాలు వెనక్కి వెళ్తామని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు అభిప్రా యప డ్డారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తన స్వగృహంలో శనివారం ఆయన టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడు తూ... గత ఐదేళ్లలో రాష్ట్రం ఎంతో వెనుకబడిందని, అనేక అక్రమాలు అవినీతి జరిగిం దని ఆరోపిం చారు. ఇసుక మాఫియా, భూ ఆక్రమణలు జరిగాయన్నారు. దీనివల్ల ఎంతోమంది ఇబ్బందులు పాలయ్యారని తెలిపారు. టీడీపీని కాపాడేందుకు చంద్రబాబు నాయుడు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని అందుకోసం తమ వంతు ప్రయత్నంగా కార్యకర్తలు కూడా సహకరించాలని కోరారు. కార్యకర్తలు సభ్యత్వం తీసుకోవడమే కాకుండా క్రమశిక్షణతో మెలగాలని ఎవరైనా పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరి స్తుంటే లేఖలు రాయాలని సూచించారు. ప్రజాసేవే పరమావ ధిగా కార్యకర్తలు ఉండాల న్నారు. ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్ కుమార్, వెంకట రాఘవరెడ్డి, భాస్కర్ నాయుడు, సుదర్శన్ నాయుడు,ప్రకాష్, నారాయణ యాదవ్, కిషోర్ తదితరులు కూడా పాల్గొన్నారు.

తిరుమల రవాణా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా ఆయుధపూజ

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : టీటీడీ రవాణా శాఖ తిరుమల విభాగంలో ప్రతి ఏటా నిర్వహించే ఆయుధపూజ శనివారం స్థానిక వర్క్‌షాపులో ఘనంగా జరిగింది. టీటీడీ అడిషనల్ ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలలోని వివిధ టీటీడీ వాహనాలను పుష్పగుచ్ఛాలు, అరటి తోరణాలతో సంప్రదాయబద్ధంగా అలంకరించారు. శ్రీవారి విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు. రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవో (ఆర్-1) భాస్కర్, వీజీఓ సురేంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత నమోదును విజయవంతం చేద్దాం : ఎంపీ,ఎమ్మెల్యే

విశాలాంధ్ర -చిత్తూరు : టిడిపి అధినేత,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయానికి అనుగుణంగాఐక్యంగా పనిచేసి, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరు పార్లమెంట్ అధ్యక్షులు సి.ఆర్ రాజన్ ఉద్ఘాటించారు.శని వారం చిత్తూరు పార్లమెంటు కార్యాల యంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్,చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సి.ఆర్ రాజన్, చిత్తూరు నియోజకవర్గం పరిశీలకులు సునీల్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే ఏ.యస్.మనోహర్, టిడిపి సీనియర్ నేత చంద్రప్రకాష్, చిత్తూరు పార్లమెంటు వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు సునీల్ చౌదరి తదితరులు సమావేశమయ్యారు.ముఖ్యంగా ప్రస్తుతం చిత్తూరు పార్లమెంటు పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం పై చర్చించారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాల్సిన భాధ్యత తమ అందరిపై ఉందని..,ఈ నేపథ్యంలో గతం కంటే ఈసారి సభ్యత్వ నమోదును పెంచాలని నిర్ణయించారు. ఆ దిశగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేసేవిధంగా ప్రోత్స హిం చాలని నిశ్చయించారు.అనంతరం చిత్తూరు పార్లమెంటులో జరుగు తున్న రాజకీయ పరిణామాల పై సుదీర్ఘంగా సమీక్షించారు. తామం తా కలిసి కట్టుగా పనిచేసి అసత్య ఆరోపణలకు చెక్ పెట్టాలని, ప్రజాసేవకు తాము బద్ధులమనే విషయాన్ని.. చేతుల్లో చేసి చూపు దామని నినదించారు.

పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జి పి.శ్రీనివాస రావుకు జిల్లా జడ్జిగా పదోన్నతి

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు సీనియర్ సివిల్ కోర్ట్ జడ్జ్ పగడాల శ్రీనివాస రావుకు జిల్లా జడ్జిగా పదోన్నతి పొందారు. ఆ మేరకు శుక్రవారం జిల్లా జడ్జిగా పదోన్నతి రావడం పై ప్రొసీడింగ్స్ వచ్చాయి. పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జిగా గత మూడు సంవ త్సరాల క్రితం ఆయన బాధ్యతలను పలమనే రులో చేపట్టారు. అప్పటినుండి పలు రకాల కేసుల పరిష్కారానికి తన వంతు నిత్యం కృషి చేశారు. ఇందులో భాగంగా తల్లిదండ్రులను వారి కుటుంబ సభ్యులు వృద్ధాప్యంలో ఆశ్రమాల కు తరలించడం ఇంటి నుండి గెంటి వేయడం లాంటి వాటిపై ప్రత్యేకంగా శ్రద్ధ చూపించారు. లోకఅదాలత్‌లో చాలావరకు కేసుల పరిష్కారానికి కృషిచేశారు.మారు మూల ప్రాంతాలకు వైద్యం అందుబాటులో వచ్చేటట్లు సంబంధిత అధికారులకు తెలిపి చొరవచూపారు.. ఐసిడిఎస్ అధికారులకు బాల్య వివాహాలపై. డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తిం చడం. చిన్న పిల్లలను పనులలో పెట్టుకో కూడదన్న వాటిపై మరియు 12 సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న రెండు సివిల్ దావా కేసులను పరిష్కరించి రెండు కుటుం బాలకు మధ్య సామరస్యంగా పరిష్కరించారు .ఇలాం టివి అధిక మొత్తంలో కేసుల పరిష్కారానికి తన వంతు ఆయన కృషి చేయడం పట్టణ సమీపంలోని 70 ఎకరాలు వివాదాన్ని కూడా ఎట్టకేలకు పరిష్కరించారు. కోర్టు ఆవర ణలో స్వచ్ఛతాహి కార్యక్రమాలను నిర్వహిం చారు. కళాశాలలు. పాఠశాలల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేసి చట్టాలపై విద్యార్థులకు అవగాహన అలాగే ర్యాగింగ్. గుడ్ టచ్. బ్యాడ్ టచ్. మాదకద్ర వ్యాల దుర్వినియోగం లాంటి వాటిపై మరియు ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు హెల్మెట్లు ధరించడం వాహన చోదకులు జాగ్రత్తలు పై ర్యాలీలను చేపట్టారు. ఇలా పలమనేరులో మూడు సంవత్సరాల పాటు జడ్జిగా కొనసాగి ఎంతోమంది కక్షిదారుల చేత శభాష్ అనిపించుకున్నారు.

ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి

- నవంబర్ 24న సత్యవేడు నియోజకవర్గ మహాసభ

- కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గాన్ని కదిలించి సమర శంఖం పూరిద్దాం

- సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ

విశాలాంధ్ర-పిచ్చాటూరు: ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ ఆఫీస్ బేరర్స్ సమావేశం అధ్యక్షులు అన్నాదొరై అధ్యక్షతన పిచ్చా టూరులో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి ఏఐటియుసి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్య దర్శి చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణలు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 105 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఐటియుసి స్వాతంత్ర పోరాటంలోనూ బ్రిటీష్ వారికి వ్యతిరే కంగా భారతదేశ స్వాతంత్రం కోసంఅనేక పోరాటాలను నడిపించి విజయం సాధించిన చరిత్ర ఏఐటియుసి అని వారు కొనియా డారు. అలాంటి ఏఐటియుసి సత్యవేడు నియోజకవర్గ మహాసభ నవంబర్ 24వ తేదీన వరదయ్యపాలెం లో జరుగు తుందని ఈ మహాసభల జయప్రదం కు కార్మిక వర్గం కదిలి రావాలని వారు పిలుపునిచ్చారు. దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజా వ్యతిరేక విధానాలను అమలుపరుస్తూ పెట్టుబడిదారులకు ఉపయోగపడే విధానాలను అనుసరిస్తున్నా యని అందువల్ల దేశంలో కార్మిక వర్గం కట్టు బానిసలుగా మారిపోయే ప్రమాదం ఉందని బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు కట్టు బాని సలు చేసే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తానా తందానా అంటూ తలలు ఊపుతున్నాయని పార్లమెం టులో చేతులెత్తుతున్నాయని వారు అన్నారు.ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కారు చౌకగా అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. పెద్ద పెద్ద చదువులు చదివి ఉద్యోగాలు లేక ఉపాధి లేక ప్రైవేట్ ట్రాన్ పోర్ట్ పై ఆధారపడి ఆటోలు టాక్సీలు ప్రైవేట్ ఫైనాన్స్ వద్ద తీసుకొని ఈ అమ్మా యిలు చెల్లించలేక అనేక అష్ట కష్టాలు పడుతున్న కార్మిక వర్గంపై నూతన క్రిమినల్ చట్టాలు పేరుతో విపరీతమైన పెనాల్టీలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం చట్టాలను తీసుకువస్తుంది. ఇది చాలదన్నట్టు రాపిడో లాంటి సంస్థలకు విచ్చలి విడిగా అనుమ తులు ఇస్తూ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ రంగాన్ని నిర్వీర్యం చేస్తుంది ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి అందుకే 105వ ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరిం చుకొని వాడవాడలలో జెండాలు ఎగరవేసి సమావేశాలు సభలు జరుపుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై సమర శంఖం పూజించడం కోసం కార్మిక వర్గాన్ని కదిలించి సమర శంఖం పూరించి ఉద్యమాలకు ఊపిరి పోస్తూ కార్మిక వర్గం సత్తా చాటాల్సిన సమయం ఆసన్నమైందని అందుకు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కార్మిక వర్గాన్ని కదిలించి పోరాటాలకు పదును పెట్టి ఉద్యమాలను ఉధృతం చేస్తాం అని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, సిపిఐ సత్యవేడు నియోజ కవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, సుభాష్, చంద్ర, నాగార్జున, కోటేశ్వ రరావు, సుబ్రహ్మణ్యం, ముని చంద్ర తదితరులు పాల్గొన్నారు.